# కోల్‌కతా మెరిసె

**వాంఖడేలో ముంబైని చిత్తుచేసిన నైట్‌రైడర్స్ ● రాణించిన కేకేఆర్ బౌలర్లు ● ప్లేఆఫ్స్ నుంచి హార్దిక్‌సేన ఔట్!**

**ఐపీఎల్ -17 ప్లేఆఫ్స్ రేసులో ఎక్కడో మిణుకుమిణుకుమంటున్న ఆశలను కూడా ముంబై ఇండియన్స్ చేజేతులా జారవిడుచుకుంది. సొంత మైదానంలో బౌలర్లు రాణించి కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)ను 169 పరుగులకే కట్టడిచేసినా స్వల్ప లక్ష్యాన్ని ఛేధించలేక 145 వద్దే చేతులెత్తేసింది. ముంబైకి ఈ సీజన్‌లో ఆడిన 11 మ్యాచ్‌లలో 8వ ఓటమి. బ్యాటింగ్‌లో విఫలమైనా బౌలింగ్‌లో రాణించిన కోల్‌కతా..ఏడు విజయాలతో ప్లేఆఫ్స్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకుంది.**


వెంకటేశ్ (70)

ముంబై: ఐపీఎల్-17లో వరుస ఓటములతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ సొంత గ్రౌండ్ వాంఖడేలో మరోసారి నిరాశపరిచింది. కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్దేశించిన 170 పరుగుల స్వల్ప ఛేదనలో 18.5 ఓవర్లు ఆడి 145 పరుగులకే కుప్పకూలి ఈ సీజన్‌లో 8వ ఓటమితో ప్లేఆఫ్స్ రేసు నుంచి అనధికారికంగా నిష్క్రమించింది. సూర్యకుమార్ యాదవ్ (35 బంతుల్లో 56, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. స్వల లక్ష్యాన్ని కాపాడుకోవడంలో కేకేఆర్ బౌలర్లు మిచెల్ స్టార్క్ (4/33), వరుణ్ (2/22), నరైన్ (2/22), రస్సెల్(2/30) ముంబైని కట్టడిచేశారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 19.5 ఓవర్లలో 169 పరుగులకే ఆలౌట్ అయింది. వెంకటేశ్ అయ్యర్ (52 బంతుల్లో 70, 6 ఫోర్లు, 3 సిక్సర్లు), మనీష్ పాండే (31 బంతుల్లో 42, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆ జట్టును ఆదుకున్నారు. నువాన్ తుషారా (3/42) ఆరంభంలోనే కోల్‌కతాను దెబ్బతీయగా జస్ప్రిత్ బుమ్రా (3/18) కట్టడిచేశాడు.వెంకటేశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### వెంకటేశ్ అదుర్స్

మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతాను ముంబై పేసర్ తుషారా ఆరంభ ఓవర్లలోనే దెబ్బతీశాడు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (5)ను కోల్‌కతా ఇన్నింగ్స్ నాలుగో బంతికే ఔట్ చేసి ఆ జట్టుకు తొలి షాకిచ్చాడు. అతడే వేసిన మూడో ఓవర్లో.. రెండో బంతికి అంగ్‌క్రిష్ (13) సూర్యకుమార్ యాదవ్‌కు క్యాచ్ ఇవ్వగా చివరి బంతికి శ్రేయస్ అయ్యర్ (6) మిడాన్‌లో టిమ్ డేవిడ్ చేతికి చిక్కాడు. హార్దిక్ పాండ్యా 5వ ఓవర్లో సునీల్ నరైన్ (8)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. రింకూ సింగ్ (9) చావ్లా 7వ ఓవర్లో అతడికే క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో కేకేఆర్ కష్టాలు రెట్టింపయ్యాయి. 60 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన స్థితిలో నుంచి కోల్‌కతా.. ముంబై ఎదుట 170 పరుగుల లక్ష్యాన్ని ఉంచిందంటే అది వెంకటేశ్ – మనీష్ పోరాటమే. ఈ ఇద్దరూ క్రీజులో కుదురుకునేదాకా నెమ్మదిగా ఆడినా ఆ తర్వాత జోరు పెంచారు. కొయెట్జి 12వ ఓవర్లో వెంకటేశ్.. 4, 6 బాదగా బుమ్రా 14వ ఓవర్లో పాండే సైతం ఫోర్, సిక్సర్‌తో జోరు పెంచాడు.


### ముంబైదీ అదే కథ

ఛేదనలో ముంబై ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. వచ్చినోళ్లు వచ్చినట్టే పెవిలియన్‌కు క్యూ కట్టడంతో ఆ జట్టు మరో పరాభవం తప్పలేదు. ముంబై ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే స్టార్క్.. ఇషాన్ (13)ను బౌల్డ్ చేశాడు. వన్‌డౌన్‌లో వచ్చిన నమన్ ధీర్ (11)ను చక్రవర్తి 5వ ఓవర్లో తన స్పిన్ మాయాజాలంతో బోల్తా కొట్టించాడు. రోహిత్ (11) కూడా నరైన్ ఆరో ఓవర్లో మనీష్ పాండేకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తిలక్ వర్మ (4), వధేరా (6), ముంబై సారథి హార్దిక్ పాండ్యా (1) విఫలమయ్యారు. వరుసగా వికెట్లను కోల్పోతూ ఓటమి వైపుగా సాగుతున్న ముంబైని సూర్య ఆదుకునే యత్నం చేశాడు. వైభవ్ 14వ ఓవర్లో సూర్య 4, 6, 4, 4 తో ముంబై ఇన్నింగ్స్‌కు ఊపు తేవడమే గాక 30 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. కానీ రస్సెల్ 16వ ఓవర్లో ఫుల్‌టాస్‌ను ఆడబోయి సాల్ట్‌కు క్యాచ్ ఇవ్వడంతో ముంబై ఓటమి ఖరారైంది.

### సంక్షిప్త స్కోర్లు:

**కోల్‌కతా:** 19.5 ఓవర్లలో 169 (వెంకటేశ్ 70, మనీష్ 42, బుమ్రా 3/18, తుషారా 3/42)

**ముంబై:** 18.5 ఓవర్లలో 145 (సూర్య 56, డేవిడ్ 24, స్టార్క్ 4/33, వరుణ్ 2/22)



## అవకాశాన్ని వృథా చేసుకోను: నితీశ్‌రెడ్డి

హైదరాబాద్: ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున బ్యాట్‌తో పాటు బంతితోనూ అదరగొడుతున్న తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి తనకు వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా అందుకుంటున్నాడు. గురువారం ఉప్పల్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో ముగిసిన మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ 35 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు.. 42 బంతుల్లోనే 3 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 76 పరుగులు చేసి హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మ్యాచ్ ముగిశాక నితీశ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'నన్ను నేను నిరూపించుకునేందుకు గాను గతేడాది నుంచి వేచి చూస్తున్నా. ఈ ఏడాది టీమ్ మేనేజ్‌మెంట్ నాకు ఆ అవకాశం ఇచ్చింది. నేను దానిని వృథా చేసుకోదలుచుకోలేదు' అని అన్నాడు.

## సఫారీలతో మూడు ఫార్మాట్ల సిరీస్

ముంబై: ఈ ఏడాది జూన్-జులైలో భారత మహిళల క్రికెట్ జట్టు స్వదేశంలో దక్షిణాఫ్రికాతో మూడు ఫార్మాట్ల సిరీస్ ఆడనుంది. ఈ మేరకు బీసీసీఐ శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. జూన్ 16 నుంచి జులై 7 దాకా మూడు వన్డేలు, ఒక టెస్టు, మూడు టీ20లు జరుగనున్నాయి.

## పావెల్ సారథ్యంలో..

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ కోసం వెస్టిండీస్ క్రికెట్ బోర్డు తమ దేశ జట్టును శుక్రవారం ప్రకటించింది. 15 మందితో కూడిన జట్టుకు హార్డ్‌హిట్టర్ రోవ్‌మన్ పావెల్ సారథ్యం వహించనున్నాడు. స్వదేశం వేదికగా జరుగుతున్న మెగాటోర్నీలో విండీస్ టీమ్ పటిష్ఠంగా కనిపిస్తున్నది. ఐపీఎల్‌లో ఆడుతున్న రస్సెల్, నికోలస్ పూరన్, హెట్‌మైర్, షెఫర్డ్, హోప్ లాంటి ప్లేయర్లు కీలకం కానున్నారు.

# బాక్సర్ల పతక జోరు

**ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 22 పతకాలు ఖాయం**



అస్తానా: ఆసియా అండర్-22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. అస్తానా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో యువ బాక్సర్లు భారత్‌కు 22 పతకాలు ఖాయం చేయగా ఇందులో 12 మహిళల కేటగిరీలోవే కావడం విశేషం. శుక్రవారం జరిగిన పలు విభాగాల సెమీస్ పోటీలలో ఏడుగురు బాక్సర్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. బ్రిజేష్ (48 కిలోలు) 5-0 తేడాతో తాలైబెక్ (మంగోలియా)ను ఓడించగా రాహుల్ (75 కిలోలు), ఆర్యన్ (92 కిలోలు) చైనా, కిర్గిస్థాన్ ప్రత్యర్థులపై విజయాలు సాధించారు. 60 కేజీల విభాగంలో సాగర్, ఆర్యన్ (51 కిలోలు), యశ్వర్ధన్ (63.5 కిలోలు), ప్రియాన్షు (71 కిలోలు) తుది పోరుకు అర్హత సాధించారు.

# భారత్ నంబర్ వన్

**వన్డేలు, టీ20లలో అగ్రస్థానం ● ఐసీసీ వార్షిక ర్యాంకులు**

దుబాయ్: పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో టీమ్‌ఇండియా ఆధిపత్యం దిగ్విజయంగా కొనసాగుతోంది. వన్డేలు, టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ మరోసారి అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. కానీ టెస్టులలో మాత్రం ఆ స్థానాన్ని ఆస్ట్రేలియా హస్తగతం చేసుకుంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం విడుదల చేసిన వార్షిక ర్యాంకులలో.. 122 పాయింట్లతో వన్డేలలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా టాప్-3లో నిలిచాయి. పొట్టి ఫార్మాట్‌లో రోహిత్ సేన 264 పాయింట్లతో మొదటి స్థానాన్ని నిలబెట్టుకోగా ఆసీస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా తదుపరి స్థానాల్లో కొనసాగుతున్నాయి. టెస్టులలో మాత్రం భారత్ అగ్రస్థానాన్ని కోల్పోయింది. 124 పాయింట్లతో కంగారూలు మొదటి స్థానానికి ఎగబాకగా 118 పాయింట్లతో భారత్ రెండో ర్యాంక్‌లో ఉంది.



## జ్యోతికి లైన్‌క్లియర్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు ముందు విదేశీ టోర్నీల్లో పోటీపడేందుకు తెలుగు యువ అథ్లెట్ యర్రాజీ జ్యోతితో పాటు శైలీసింగ్‌కు క్రీడాశాఖకు చెందిన మిషన్ ఒలింపిక్ సెల్(ఎమ్‌వోసీ) క్లియరెన్స్ ఇచ్చింది. శుక్రవారం జరిగిన సమావేశంలో పలువురు ప్లేయర్లు టోర్నీల్లో ఆడేందుకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని అందించేందుకు సిద్ధమైంది. యూరప్‌లో జ్యోతి ఆరు టోర్నీల్లో ఆడనుండగా, శైలి నాలుగింటిలో పోటీపడనుంది.



## ఫుట్‌బాల్ విజేత రంగారెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 10వ సీనియర్ అంతరజిల్లాల చాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో రంగారెడ్డి 3-0తో ఆదిలాబాద్‌పై ఘన విజయం సాధించింది. రంగారెడ్డి తరపున పటేల్(23ని), లలిత్(43ని), మహావీర్(92ని) గోల్స్ చేశారు. వనపర్తి, కరీంనగర్ మధ్య మూడో స్థానం కోసం జరిగిన పోరు డ్రాగా ముగిసింది.

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 10 | 8 | 2 | 0.62 | 16 |
| కోల్‌కతా | 10 | 7 | 3 | 1.09 | 14 |
| లక్నో | 10 | 6 | 4 | 0.09 | 12 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 0.07 | 12 |
| చెన్నై | 10 | 5 | 5 | 0.62 | 10 |
| ఢిల్లీ | 11 | 5 | 6 | -0.44 | 10 |
| పంజాబ్ | 10 | 4 | 6 | -0.06 | 8 |
| గుజరాత్ | 10 | 4 | 6 | -1.11 | 8 |
| ముంబై | 11 | 3 | 8 | -0.35 | 6 |
| బెంగళూరు | 10 | 3 | 7 | -0.41 | 6 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు



## స్వియాటెక్ X సబలెంక

**మ్యాడ్రిడ్ ఓపెన్ ఫైనల్‌లో ఢీ**

మ్యాడ్రిడ్: టాప్ సీడ్స్ ఇగా స్వియాటెక్ (పోలండ్), అరీనా సబలెంక (బెలారస్) మరోసారి ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీ ఫైనల్‌లో 'ఢీ'కొనబోతున్నారు. స్పెయిన్ వేదికగా జరుగుతున్న మ్యాడ్రిడ్ ఓపెన్ మహిళల సింగిల్స్ సెమీస్‌లో రెండో సీడ్ సబలెంక 1-6, 7-5, 7-6 (7/5) తేడాతో రెండో సీడ్ ఎలీనా రిబాకినాను ఓడించి స్వియాటెక్‌తో తుది పోరుకు సిద్ధమైంది. శనివారం ఈ ఇద్దరి మధ్య జరుగబోయే ఫైనల్.. గతేడాది ఇదే టోర్నీలో తుది పోరుకు రిప్లై కానుంది. 2023లో ఈ ఇద్దరే ఫైనల్ ఆడగా అప్పుడు సబలెంక టైటిల్ నెగ్గింది. ఇక మ్యాడ్రిడ్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ ఆండ్రీ రుబ్లెవ్ 6-4, 6-3 తేడాతో అమెరికాకు చెందిన 12వ సీడ్ ఫ్రిట్జ్‌ను ఓడించి ఫైనల్ చేరాడు.

## వాణిజ్య

### అరబిందో ఫార్మాకు 13 కోట్ల పన్ను నోటీసులు

హైదరాబాద్, మే 3: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మాకు జీఎస్టీ అథార్టీ షాకిచ్చింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయింనకు సంబంధించి వడ్డీని కలుపుకొని రూ.13 కోట్ల జరిమానా విధించింది. సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ చట్టం, 2017 ప్రకారం, టీజీఎస్టీ యాక్స్ 2017 ప్రకారం 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిం దాఖలు చేయకపోవడంతో ఈ నోటీసు జారీ చేసినట్లు హైదరాబాద్‌లోని పంజగుట్ట డివిజన్ డిప్యూటీ కమిషనర్(ఎస్టీ) ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఐటీసీతో పాటు జీఎస్టీ చెల్లింపులకు సంబంధించి రూ.6,54,50,645 జరిమానాపై రూ.5,92,20,900 వడ్డీ కలుపుకొని పెనాల్టీ కింద మరో రూ.65,51,354 విధించింది.

### 120 కోట్లకు టెలికం సబ్‌స్క్రైబర్లు

న్యూఢిల్లీ, మే 3: టెలికం సబ్‌స్క్రైబర్లు మరింత పెరిగారు. మార్చి నెల చివరినాటికి 119.9 కోట్లకు చేరుకున్నట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. టెలికం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌కు నూతన కస్టమర్లు చేరుకున్నట్లు తెలిపింది. అలాగే బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లు 92.4 కోట్లకు చేరుకున్నట్లు ట్రాయ్ తన నెలవారి నివేదికలో తెలిపింది. జియోకు కొత్తగా 21.4 లక్షల మంది చేరగా, ఎయిర్‌టెల్‌కు 17.5 లక్షల మంది జతయ్యారు. కానీ, వొడాఫోన్ ఐడియా 6.8 లక్షల మందిని కోల్పోగా, బీఎస్ఎన్ఎల్ 23.5 లక్షలు, ఎంటీఎన్ఎల్ 4,674 మంది వెళ్లిపోయారు.

### క్లింట్ చేతికి హైదరాబాద్ ఆఫీస్ కాంప్లెక్స్

న్యూఢిల్లీ, మే 3: క్యాపిటల్యాండ్ ఇండియా ట్రస్ట్(క్లింట్)..హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ఆఫీస్ కాంప్లెక్స్‌ను కొనుగోలు చేసింది. 25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫోనిక్స్ గ్రూపు ఈ ఆఫీస్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య ఒప్పందం జరిగింది. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో 25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ టవర్‌ను నిర్మిస్తున్నది. ఒప్పందం విలువ రూ.215 కోట్లు (34.68 మిలియన్ల సింగపూర్ డాలర్లు).

# అదానీపై సెబీ నజర్!

**గ్రూప్‌లోని 7 సంస్థలకు షోకాజ్ నోటీసులు**




న్యూఢిల్లీ, మే 3: అదానీ గ్రూప్ సంస్థలకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సంబంధిత పార్టీ లావాదేవీలు, లిస్టింగ్ నిబంధనల ఉల్లంఘనలకుగాను గౌతమ్ అదానీకి చెందిన 7 కంపెనీలకు ఈ నోటీసులు వెళ్లాయి. ఈ మేరకు సదరు సంస్థలు శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపాయి. కాగా, సెబీ నుంచి షోకాజ్ నోటీసులు అందుకున్న అదానీ గ్రూప్ కంపెనీల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్, అదానీ విల్మర్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఉన్నాయి. ఈ జనవరి-మార్చి త్రైమాసికం, గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ప్రకటించిన ఆర్థిక ఫలితాల్లోనూ ఈ విషయాన్ని అదానీ సంస్థలు స్పష్టం చేశాయి. అయితే ఏ రకమైన చట్టాలను, నిబంధనలను తాము అతిక్రమించలేదని ఆయా కంపెనీలు చెప్తున్నాయి. ఇక అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్, అదానీ విల్మర్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ మినహా మిగతా కంపెనీల ఆడిటర్లు ఆర్థిక ప్రకటనలపై క్వాలిఫైడ్ ఒపీనియన్‌ను జారీ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి చిక్కులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగానే ఇష్యూ చేసినట్టు తెలుస్తున్నది. మరోవైపు ఏసీసీ, అంబుజా సిమెంట్ తమకు సెబీ నుంచి ఏ నోటీసులూ రాలేదని ప్రకటించాయి. ఎన్డీటీవీ కూడా ఇదే ప్రకటన ఇచ్చింది. అదానీ గ్రూప్‌లో మొత్తం 10 సంస్థలు దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన విషయం తెలిసిందే. ఇందులో ఏడింటికి సెబీ నుంచి షోకాజ్ నోటీసులు వచ్చాయి.

### హిండెన్‌బర్గ్ వ్యవహారంలోనే..

అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్.. అదానీ గ్రూప్ భారీ ఎత్తున అక్రమాలకు, అవకతవకలకు పాల్పడిందని గత ఏడాది జనవరిలో సంచలన నివేదికను ఇచ్చిన విషయం తెలిసిందే. స్టాక్ మార్కెట్లలో షేర్ల ధరల పెరుగుదలకు అదానీ కంపెనీలు అడ్డదార్లు తొక్కాయని ఆ రిపోర్టులో ఆరోపించిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలోనే దీని ఆధారంగా సెబీ ఇప్పుడు ఈ షోకాజ్ నోటీసులను ఇచ్చిందని అంటున్నారు. కాగా, షోకాజ్ నోటీసు అంటే నేరారోపణ కానప్పటికీ.. ఆరోపణలపై ఎందుకు న్యాయపరమైన చర్యలు తీసుకోకూడదో కంపెనీలు వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం మాత్రం ఉంటుంది. అయితే అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ మాత్రం ఈ వ్యవహారం సుప్రీం కోర్టు దాకా వెళ్లిందని, నిపుణుల కమిటీ ఎలాంటి అక్రమాలు జరుగలేదని చెప్పిందని, సెబీ కూడా స్టేటస్ రిపోర్టు ప్రకారం 24 అంశాల్లో 22 అంశాలపై దర్యాప్తు జరిపిందని, సుప్రీం కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చిందని గుర్తు చేసింది.

# నయా పల్సర్ ఆగయా

**ధర రూ.1.85 లక్షలు**



న్యూఢిల్లీ, మే 3: దేశీయ మార్కెట్‌కు నయా పల్సర్ బైకును పరిచయం చేసింది బజాజ్ ఆటో. పల్సర్ ఎన్ఎస్400 జెడ్ పేరుతో విడుదల చేసిన ఈ బైకు ప్రారంభ ధర రూ.1.85 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 373సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 39.4 బీహెచ్‌పీ శక్తినివ్వనున్నది. డ్యూక్ 390, ట్రయంఫ్ 400, అపాచీ 310, హ్యార్లీ 440లకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. డామినర్ 400 కంటే రూ.46 వేలు తక్కువకే సంస్థ ఈ బైకును అందిస్తున్నది.

## తగ్గిన విదేశీ నిల్వలు



ముంబై, మే 3: విదేశీ మారకం నిల్వలు మరింత కరిగిపోయాయి. వరుసగా మూడో వారం కూడా ఫారెక్స్ రిజర్వులు 2.41 బిలియన్ డాలర్లు తరిగిపోయాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఏప్రిల్ 26తో ముగిసిన వారాంతానికిగాను రిజర్వులు 637.922 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు తన వారాంతపు సమీక్షలో పేర్కొంది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 2.28 బిలియన్ డాలర్లు తగ్గి 640.33 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు తెలిపింది. గత నెల మొదట్లో రిజర్వులు చారిత్రక గరిష్ఠ స్థాయి 648.562 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. గతవారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 1.159 బిలియన్ డాలర్లు తగ్గి 559.701 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు తెలిపింది. యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు హెచ్చు తగ్గుదలకు లోనుకావడంతో విదేశీ మారకం నిల్వలపై ప్రతికూల ప్రభావం చూపాయని పేర్కొంది. అలాగే పసిడి రిజర్వులు కూడా 1.275 బిలియన్ డాలర్లు తగ్గి 55.533 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ 15 మిలియన్ డాలర్లు ఎగబాకి 18.048 బిలియన్ డాలర్లకు, ఐఎంఎఫ్ వద్ద నిల్వలు 8 మిలియన్ డాలర్లు అధికమై 4.639 బిలియన్ డాలర్లకు చేరాయి.

# రెండు లక్షల కోట్ల సంపద ఆవిరి

**భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు**

ముంబై, మే 3: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. టెలికం, క్యాపిటల్ గూడ్స్, టెక్నాలజీ రంగ షేర్లలో క్రయవిక్రయాలు అధికంగా జరగడంతో రికార్డు స్థాయిలో దూసుకుపోయిన సూచీలు అంతేస్థాయిలో వెనక్కితగ్గాయి. ఇంట్రాడేలో 75 వేల మార్క్‌ను అధిగమించిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 732.96 పాయింట్ల నష్టంతో 73,878.15 వద్ద స్థిరపడింది. కనిష్ఠ స్థాయి నుంచి1,627 పాయింట్ల శ్రేణిలో సూచీ కదలాడింది. బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు మార్కెట్లను పడేశాయి. సూచీలో హెవీవెయిటేజ్ అయిన ఈ మూడు షేర్లు నష్టాల్లోకి జారుకోవడం సూచీలు నష్టపోవడానికి ప్రధాన కారణమని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఒక దశలో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న ఎన్ఎస్ఈ నిఫ్టీ 172.35 పాయింట్లు కోల్పోయి 22,475.85 వద్ద స్థిరపడింది. దీంతో లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. సూచీల్లో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.2,25,543.41 కోట్లు కరిగిపోయి రూ.4,06,24,224.49 కోట్లు(4.89 ట్రిలియన్ డాలర్లు) వద్ద నిలిచింది.



- ఎల్అండ్‌టీ, మారుతి, భారతీ ఎయిర్‌టెల్, నెస్లే, రిలయన్స్ షేర్లు రెండు శాతానికి పైగా కోల్పోయాయి.
- జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీలు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
- వీటితోపాటు టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, టీసీఎస్, విప్రో షేర్లు తగ్గాయి.
- బజాజ్‌ఫైనాన్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, మహీంద్రా, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే టెలికమ్యూనికేషన్, రియల్టీ, సర్వీసులు, టెక్, కన్జ్యూమర్ డ్యూరబుల్, ఐటీ, కమోడిటీస్ షేర్లు నష్టపోగా..హెల్త్‌కేర్, మెటల్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- మొత్తంమీద ఈవారంలో సెన్సెక్స్ 147.99 పాయింట్లు, నిఫ్టీ 55.9 పాయింట్లు చొప్పున బలపడ్డాయి.

### రూ.72వేల దిగువకు బంగారం

**ఒక్కరోజే తులం రూ.540 తగ్గుముఖం**

న్యూఢిల్లీ, మే 3: బంగారం ధరలు తగ్గాయి. శుక్రవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ.540 పడిపోయి రూ.71,730 వద్ద నిలిచింది. 22 క్యారెట్ పుత్తడి తులం విలువ కూడా రూ.500 దిగి రూ.65,750గా ఉన్నది. గురువారం ముగింపుతో చూస్తే ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లోనూ 24 క్యారెట్ పసిడి రేటు 10 గ్రాములు రూ.350 క్షీణించింది. ఇదిలావుంటే అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి ధరలు నేల చూపుల్నే చూశాయి. ఔన్సు 7 డాలర్లు దిగి 2,297 డాలర్లకు పరిమితమైంది. ద్రవ్యోల్బణ భయాల నడుమ గత అంచనాలను తలకిందులు చేస్తూ అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్.. వడ్డీరేట్లను తగ్గించడానికి చాలా కాలమే తీసుకుంటుందన్న ఊహాగానాలు గోల్డ్ మార్కెట్‌ను కుదిపేశాయని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. కాగా, వెండి ధరలు స్థిరంగా ఉన్నాయి.



*ఆయుర్వేద ఔషధాల కోసం క్లినికల్ పరీక్షల అధ్యయనాల నిర్వహణకుగాను పతంజలి రిసెర్చ్ ఫౌండేషన్, చెన్నైకి చెందిన ఎస్ఆర్ఎం సెంటర్ ఫర్ క్లినికల్ ట్రయల్స్ అండ్ రిసెర్చ్ మధ్య శుక్రవారం ఎంవోయూ కుదిరింది. ఈ ఒప్పంద పత్రాలతో పతంజలి జనరల్ సెక్రటరీ ఆచార్య బాలకృష్ణ, ఎస్ఆర్ఎం సీసీటీఆర్ డీన్ నితిన్ ఎం నాగర్కర్. ఆయుర్వేద చరిత్రలో ఈ ఒప్పందం ఓ మైలురాయి కాగలదని, ఆయుర్వేదానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి పతంజలి ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆచార్య బాలకృష్ణ ఈ సందర్భంగా అన్నారు.*

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.